
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
7
ఆదివారం 19 అక్టోబరు 2025



బీసీ బంద్ సక్సెస్


ఎల్లారెడ్డిపేటలో మూసి ఉన్న దుకాణాలు

- స్తంభించిన రాజన్న సిరిసిల్ల జిల్లా..
- జిల్లావ్యాప్తంగా ర్యాలీలు ధర్నాలు
- ముందస్తుగానే ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు
- సర్కారు పాఠశాలలు, కళాశాలల్లో తరగతుల బహిష్కరణ
- బీసీ సంఘాల ఆందోళనకు సర్వత్రా మద్దతు
- పాల్గొన్న కాంగ్రెస్, బీఆర్ఎస్, వామపక్ష పార్టీలు
- ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్
- జిల్లాలో పోలీసుల భారీ బందోబస్తు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన తెలంగాణ బంద్ రాజన్న సిరిసిల్ల జిల్లాలో విజయవంతంగా ముగిసింది. బీసీ సంఘాల బందుకు మద్దతుగా రాజకీయ, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలన్నీ మద్దతు పలికాయి. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని వివిధ పార్టీలు వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించాయి. ముందస్తుగానే ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో తరగతులు బహిష్కరించారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్టీసీ డిపోల నుంచి బస్సులు కదలలేదు. దీంతో సిరిసిల్ల, వేములవాడ బస్ స్టేషన్లు వెలవెల బోయాయి. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు ముస్తాబాద్, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, తంగళ్ళపల్లి, ఇల్లంతకుంట, బోయినపల్లి, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట మండల కేంద్రాల్లో వ్యాపార, వాణిజ్య సంస్థలు, పెట్రోల్ బంకులు మూసివేశారు. సిరిసిల్ల, వేములవాడలో సినిమా హాళ్లతో పాటు దుకాణాలు మూసివేయడంతో రద్దీ ప్రాంతాలు వెలవెలబోయాయి.

ర్యాలీలు.. ధర్నాలు

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా బందులో భాగంగా బీసీ సంఘాలు, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ నాయకులు ర్యాలీలు, ధర్నాలు నిర్వ హించారు. సిరిసిల్లలో కాంగ్రెస్, బీసీ సంఘాలు ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు ద్విచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహించి మద్దతు ప్రకటించారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్టీసీ డిపోల ఎదుట కాంగ్రెస్, సీపీఎం ఇతర పార్టీల నాయకులు ధర్నా నిర్వహించారు. వేములవాడ డిపో ఎదుట ధర్నాలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. సిరిసిల్లలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హనుమాండ్లుతో పాటు పలువురు బీసీ నాయకులు ర్యాలీ నిర్వహించారు.

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, కాంగ్రెస్ నాయకులు ఆకునూరు బాలరాజు, గడ్డం నర్సయ్య, సంగీతం శ్రీనివాస్, యేల్లె లక్ష్మీనారాయణ, కత్తెర దేవదాస్, గోనె ఎల్లప్ప, గోలి వెంకటరమణ, బొప్ప దేవయ్య ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ బైక్ ర్యాలీ లో పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీసీ సెల్ అధ్యక్షుడు బొల్లి రామ్మోహన్, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరు ప్రవీణ్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, వెంగళ శ్రీనివాస్, మ్యాన రవిలు పాల్గొన్నారు. సిరిసిల్ల ఆర్టీసీ డిపో ఎదుట సీపీఎం ధర్నాలో జిల్లా కార్యదర్శి మూషం రమేష్, రమణ, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు. ముస్తాబాద్‌లో బీసీ జేఏసీ వంటావార్పు నిర్వహించారు. తంగళ్ళపల్లి, వేములవాడలో ఇతర మండలాల్లో ధర్నాలు, ర్యాలీలు నిర్వహించారు.


సిరిసిల్ల బస్ స్టేషన్ వెలవెల


సిరిసిల్ల గాంధీ చౌక్ వద్ద వాణిజ్య సంస్థల మూసివేత




సిరిసిల్ల ఆర్టీసీ బస్‌డిపో ఎదుట సీపీఎం నాయకుల ధర్నా, సిరిసిల్లలో బీఆర్ఎస్ నాయకుల ర్యాలీ, వేములవాడ ఆర్టీసీ బస్ డిపో ఎదుట ధర్నాలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నాయకులు

బీజేపీ ఎంపీలు మోదీ వద్ద ఎందుకు మాట్లాడటం లేదు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


బైక్ ర్యాలీలో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నా ప్రధానమంత్రి మోదీ దగ్గర ఎందుకు బీసీ బిల్లు గురించి మాట్లాడటం లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఉదయం ఆర్టీసీ డిపో ఎదుట కాంగ్రెస్ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం అఖిలపక్షం నాయకులతో కలిసి బైక్‌పై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేసి 2018 పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించారన్నారు. బీసీ బిల్లు అమలుపై ఆర్డినెన్స్ జాజీ చేయవలిసిందిగా గవర్నర్‌కు పంపారన్నారు. బీసీ బిల్లుపై రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరినా ఇవ్వలేదని తెలిపారు. రాష్ట్రంలోని బీజేపీ కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రంరావు బాధ్యత వహించి నరేంద్రమోదీని ఒప్పించి అపాయింట్‌మెంట్ తీసుకుని 42శాతం రిజ్వేషన్ అమలయ్యేలా చూడాలని కోరారు. రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలు మోదీని ఒప్పించాలన్నారు. బీజేపీ నాయకులు రాష్ట్రంలో సై అంటున్నారని, ఢిల్లీలో నై అంటున్నారని, ఎందుకు యూటర్న్ తీసుకుంటున్నారని నిలదీశారు. బీసీ బిడ్డల నోటికి వచ్చిన బుక్కను తీసివేయవద్దని అన్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద బీసీ సంఘాల వారికి బీఆర్ఎస్ నేతలు ఎందుకు మద్దతు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. బీజేపీకి బీఆర్ఎస్ వాళ్లే వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడలేక పోతున్నారని, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయడానికి పూర్తిస్థాయిలో ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కోర్టులపై పూర్తి నమ్మకం ఉందని, కోర్టు ఎక్కడ తాము చేసిన చట్టాన్ని ఎక్కడ తప్పుపట్టలేదని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాలు ఏకమై జేఏసీగా ఏర్పడి ప్రజల మనోభావాలు ప్రతిబింబించేలా బంద్ చేపట్టడం జరుగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

టపాసులు అ'ధర'గొడుతున్నాయి..

- 48 గంటల వ్యాపారం.. పేలుతున్న 'అక్రమాలు' - జిల్లా అంతటా జోరుగా జీరో దందా..
- వచ్చే సరుకు లక్షల్లో.. బిల్లులు నామమాత్రం.. - ఏటా ఇదే పరిస్థితి.. పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

దీపావళి అంటేనే లక్ష్మీ పూజలు, విరజిమ్మే బాణాసంచా, టపాసులతో సంబురాలు.. కానీ 48 గంటలు మాత్రమే సాగే టపాసుల వ్యాపారంలో లక్షల్లోనే అక్రమాలు సాగుతాయి. తాత్కాలిక లైసెన్స్ పొందడం మొదలుకొని టపాసుల విక్రయాల వరకు అక్రమాలు కనిపిస్తూనే ఉంటాయి. ప్రతి యేడాది రాజన్న సిరిసిల్ల జిల్లాలో జీరో వ్యాపారం సాగుతున్న అధికారులు మాత్రం చోద్యం చూస్తారనే విమర్శలు ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా వంద వరకు లైసెన్స్‌లు పొంది జిల్లా కేంద్రంతో పాటు వేములవాడ మండల కేంద్రాల్లోనూ భారీగా టపాసులు, బాణాసంచా వ్యాపారం సాగుతోంది. చాలా గ్రామాల్లో అనధికారిక అమ్మకాలు కూడా సాగుతాయి. కేవలం రెండు నుంచి మూడు రోజుల పాటు జరిగే బాణాసంచా వ్యాపారంలో అక్రమాలు కోకోల్లలుగా కనిపిస్తాయి. జిల్లాకు సంబంధించిన వ్యాపారులు సిద్దిపేట, జగిత్యాల, కామారెడ్డి జిల్లాల నుంచి టపాసులను తీసుకవచ్చి విక్రయాలు జరుపుతారు. దొడ్డిదారిన టపాసులు తీసుకవస్తున్న వాహనాలను పట్టించుకునే వారే లేరని విమర్శలు ఉన్నాయి. లైసెన్స్‌లు రాకముందే సరుకులు తీసుకవస్తుంటారు. రూ పది లక్షలు విలువ చేసే టపాసులు తీసుకవస్తే కేవలం రూ.2లక్షల సరుకు ఉన్నట్లుగానే చూపిస్తుంటారు. ప్రతియేటా సాగుతున్న ఈ అక్రమ వ్యాపారంపై విజిలెన్స్, ఇతర శాఖల అధికారులు దృష్టి సారించకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. విక్రయాల కోసం తాత్కాలికంగా పొందిన లైసెన్స్ షెడ్ నిర్మాణాలకు రూ.30 నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతుం దని వ్యాపారులు తెలిపారు.


సిరిసిల్లలోని టపాసుల దుకాణాలు

నిబంధనలు దూరమే..

సిరిసిల్ల, ఇతర ప్రాంతాల్లో బాణాసంచా అమ్మకాలు జనవాసాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు సాగిస్తున్నారు. సిరిసిల్లలో బతుకమ్మ ఘాట్ వద్ద నిబంధనల ప్రకారం కాకుండా ఇష్టారాజ్యంగానే దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఒక దుకాణానికి మరో దుకాణానికి మధ్య కనీసం మూడడుగుల దూరం ఉండడంతో పాటు ఇసుక, నీరు, నీటి డ్రమ్ములు ఏర్పాటు చేసుకోవాలి. ఈ నిబంధనలు ఏమీ పాటించకుండా కేవలం వరుస షెడ్లు ఏర్పాటు చేసుకొని విక్రయాలు జరుపుతున్నారు. ఫైర్ సేఫ్టీని పట్టించుకోవడం లేదు. నిబంధనలు పాటించకపోయినా ఆయా శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

చిన్న వ్యాపారులకు నష్టం..

టపాసుల వ్యాపారంలో కొద్దిమేరకు లైసెన్స్ తీసుకొని బిల్లుల ప్రకారం సరుకు తెచ్చుకుని అమ్ముకునే చిన్నవ్యాపారులకు నష్టం కలుగుతోంది. అక్రమ మార్గాన బాణాసంచా తెచ్చి అమ్ముకునే వ్యాపారులు తక్కువ ధరకు ఇవ్వడంతో చిన్న వ్యాపారులు నష్టపోతున్నారు. సరుకు మిగిలి ఇబ్బందులుపడుతున్నారు.

ధరల మోత..

దీపావళి అనగానే గుర్తుకు వచ్చేవి టపాసుల సంబురమే. ప్రతి ఒక్కరూ బాణాసంచా కాల్చడానికి ఇష్టపడుతారు. ఈసారి మాత్రం టపాసుల ధరలు పేలుతున్నాయి. ఎమ్మార్పీ రేట్లపై అయోమయం ప్రతి యేటా వినియోగదారుల్లో ఉంటుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో యేటా దాదాపు రూ.3 కోట్ల నుంచి 3.50 కోట్ల వరకు బాణాసంచా వ్యాపారం జరుగుతుంది. గతంలో ఒక బాంబుల ప్యాకెట్ రూ.150 ఉంటే ఈసారి రూ.200 దాటినట్లుగా వ్యాపారులు తెలిపారు.

వ్యాధి నిరోధక టీకా కేంద్రం తనిఖీ


ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో రజిత

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం సుందరయ్యనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను, మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికి వ్యాధి నిరోధక టీకాలు షెడ్యూల్ ప్రకారం ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది ప్రతిరోజు సమయం పాలన పాటిస్తూ రోగులకు సేవలను అందించాలని సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్ర సిబ్బందితో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై రివ్యూ నిర్వహించారు.

వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

వేములవాడ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ప్రాంతీయ ఏరియా ఆసుపత్రిలోని వైద్యులు మరో అరుదైన ఘనత నమోదు చేశారు. కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులో చేపట్టే అరుదైన ప్లాస్టిక్ సర్జరీ ఆపరేషన్‌ను విజయంతంగా చేపట్టినట్లు డీపీఆర్వో ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆర్థో డాక్టర్ అనిల్ ఆధ్వర్యంలో నరసింహాచారి అనే వ్యక్తి కాలి గాయానికి చర్మం పూర్తిగా పొడవడంతో అతడి చర్మాన్నే వేరొక చోటి నుంచి తీసి గాయానికి అతికించినట్లు తెలిపారు. ఇలాంటి అరుదైన ఆపరేషన్లు హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రమే జరుగుతాయని తెలిపారు. ఆసుపత్రిసూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య ప్రోత్సాహంతో డాక్టర్ అనిల్, మత్తు వైద్యుడు తిరుపతి బృందంతో విజయవంతంగా చేపట్టినట్లు తెలిపారు. వీటితో పాటుగా గత 24 గంటల్లో 2సాధారణ కాన్పులు, 8 ఆపరేషన్ కాన్పులు, 5 ఆర్థోపెడిక్ ఆపరేషన్‌లు 5 జనరల్ సర్జరీలు మొత్తం కలిపి 20 ఆపరేషన్‌లు చేపట్టినట్లు తెలిపారు.

రసమయి ఇంటిపై దాడి సరికాదు..

ఇల్లంతకుంట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఇంటిపై దాడిచేయడం సరైనది కాదని జడ్పీమాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ నాయకులు గూండాగిరి చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి ఉందన్నారు. నిరంతరం ప్రజల కోసం పాటుపడే రసమయి బాలకిషన్‌కు పెరుగుతున్న ఆదరణ చూసి కాంగ్రెస్ నాయకులు తట్టుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. ఇంటిపై దాడిచేసి పైశాచిక ఆనందం పొందుతున్న నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

జనావాసాల మధ్య టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):అనుమతి లేకుండా జనావాసాల మధ్య టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అగ్నిమాపక భద్రత విభాగం అధికారి నరేందర్ అన్నారు. మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన టపాసుల దుకాణాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారి నరేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన మేరకు అనుమతులు పొంది భద్రత చర్యలు చేపట్టాలన్నారు. జన సంచారం ఉన్న ప్రాంతాల్లో కాకుండా గ్రామాల శివారులో దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఉపాధిహామీ పనులపై గ్రామ సభ

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సత్తయ్య ఆధ్వర్యంలో ఉపాధిహామీ పనులపై శనివారం గ్రామ సభను నిర్వహించారు. 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధిహామీ పథకం కింద చేపట్టే పనులు గుర్తించి ప్రణాళికలు రూపొందించడం, కూలీలకు కల్పించే పనిదినాలు, తదితర అంశాలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వం అదనంగా నిధులు కేటాయించడంతో ప్రణాళికలను తిరిగి తయారుచేసి నివేదించనున్నామని అధికారి సత్తయ్య పేర్కొన్నారు. కూలీలకు పని కల్పించడంతోపాటు గ్రామాల అభివృద్ధికి నిధులు వెచ్చించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో ఈజీఎస్ ఏపీవో కొమురయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సిబ్బంది రాజు, ప్రభాకర్, నరేశ్, కూలీలు పాల్గొన్నారు.

రైతుల కోసం సాంకేతిక సూచనలు

కోనరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నాగారం గ్రామంలో అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞాన సూచనలు ఇచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు నాగారం గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డిజిటల్ సాంకేతికత ద్వారా వ్యవసాయం అనేది లాభసాటిగా ఉంటుందని పవిత్ర వివరించారు. వ్యవసాయంలో సరైన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సికింద్రాబాద్ కళాశాల సహాయ ఆచార్యులు డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ విలాకర్, గ్రామస్థులు దోంపెట నాగరాజు, మేకల ప్రకాష్, బొమ్మల కిషన్ రావు, బాసర రామచంద్రం, మేకల స్వామి తదితరులు ఉన్నారు.

పంట పక్వానికి వచ్చిన తర్వాతే కోయాలి..

చందుర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వరి పంట పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతే కోతలు చేపట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి దుర్గరాజు అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో వరి కోత యంత్రాల యజమానులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ హార్వెస్టర్ యజమానులు వరి కోతలు చేసేటప్పుడు తప్పనిసరిగా వరి చేను పూర్తిగా పక్వానికి వచ్చిన తరువాత మాత్రమే కోయాలన్నారు. కోత మిషన్ ఉపయోగించేటప్పుడు బ్లోయర్ ఆన్‌లో ఉండాలన్నారు. కోత మిషన్ ఆర్పీఎం 19-20 పైన ఉండాలన్నారు. గేర్ స్పోట్ ఏ2 నుంచి బి1లో పెట్టి కోత కొనసాగించడం ద్వారా తాలు గడ్డి, మట్టి బెడ్డలు రాకుండా చూసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భూపతి, ఏఎంసీ వైస్ చైర్మన్ మల్లేశం, ఏటీఎం పవన్, పీఏసీఎస్ సెక్రెటరీ శ్రీవర్ధన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

కరీంనగర్ డెయిరీ స్వీట్లతో.. దీపావళి సంబరాలు


- నోరూరించే దూద్ పేడ
- మైమరిపించే మలాయి లడ్డు, మిల్క్ కేక్
- బల్క్ ఆర్డర్‌గా బాసుంది.. కోవా జామూన్
- అన్ని పార్లర్లలో అందుబాటులో స్వీట్లు
- ఆన్‌లైన్ ఆర్డర్‌తో డోర్ డెలివరీ


మలాయి లడ్డు


మిల్క్ కేక్


కర్జూర కోవా


దూద్ పేడ


కోవా జామూన్



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

నోరూరించే స్వచ్ఛమైన దూద్‌పేడ, నోట్లో వేసుకుంటే కరిగిపోయే కర్జూర్ కోవా, మలాయి లడ్డు, మిల్క్ కేక్, బాసుంది, కోవా జామూన్ వంటి స్వీట్లతో ఈ దీపావళి పండుగను జరుపుకోమంటోంది కరీంనగర్ డెయిరీ. నాణ్యమైన నెయ్యి, స్వచ్ఛమైన పాలతో ఎనిమిది టన్నుల స్వీట్లను తయారు చేసి తన 13 డిపార్టుమెంటల్ డెయిరీ పార్లర్లు, ఒక ఫ్రాంచైజీ పార్లర్‌లో 200, 500 గ్రాముల ప్యాక్‌లలో అందుబాటులో ఉంచింది. దూద్‌పేడ కిలోకు 480, మిల్క్‌కేక్, కర్జూర్ కోవా 450, మిక్స్‌డ్ స్వీట్ కేజీ 480 రూపాయల చొప్పున వినియోగదారులకు అందిస్తున్నది. కరీంనగర్ డెయిరీ యాప్‌ను ఈ సంస్థ అందుబాటులోకి తెచ్చింది. యాప్ స్టోర్‌లో దీనిని డౌన్‌లోడ్ చేసుకొని 250 రూపాయల మేరకు డెయిరీ ఉత్పత్తులను ఆర్డర్ చేస్తే డోర్ డెలివరీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. పన్నీర్, పెరుగు, లస్సీ, బట్టర్‌మిల్క్, స్వీట్లు, నెయ్యి తయారు చేసి విక్రయిస్తున్నది. చక్కెర కలపని కోవాను కిలోకు 410 రూపాయల చొప్పున దానిని విక్రయిస్తున్నది. శుభకార్యాలకు బాసుంది, కోవా జామూన్‌ను బల్క్ ఆర్డర్‌గా సప్లయి చేయడానికి ఏర్పాట్లు చేసింది. బాసుంది కిలో 260, కోవా జామూన్‌ను కిలో 325 రూపాయలకు ఆర్డర్‌పై పెద్ద మొత్తంలో తయారు చేసి ఇస్తోంది. ప్రతి రోజు రెండు వేల కేజీల పన్నీర్‌ను తయారు చేసి మార్కెట్‌లో అందుబాటులోకి ఉంచుతోంది. దసరా పండగ సందర్భంగా ఒకే రోజు 30 టన్నుల పన్నీర్‌ను విక్రయించి కరీంనగర్ డెయిరీ రికార్డు సృష్టించింది.

దీపావళికి బల్క్ ఆర్డర్లు స్వీకరిస్తాం..

- రాజశేఖర్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్



వాణిజ్యసంస్థలు, విద్యాసంస్థలు బల్క్ ఆర్డర్ ఇస్తే స్వీకరిస్తాము. స్వీట్ ఆర్డర్ చేయదలుచుకున్న వారు 91777-37070కు ఫోన్ చేసి ఆర్డర్ చేయవచ్చు. కరీంనగర్ డెయిరీ యాప్ ద్వారా ఆర్డర్ చేసి డోర్ డెలివరీ సౌకర్యాన్ని పొందవచ్చు.

జనవరి నుంచి ప్యూర్ ఘీ స్వీట్స్..

- సీహెచ్ రాజేశ్వర్‌రావు, కరీంనగర్ డెయిరీ చైర్మన్



జనవరి 2026 నుంచి వినియోగదారులకు పూర్తిగా నెయ్యితో తయారు చేసే స్వీట్లను అందుబాటులోకి తెస్తాం. మారుతున్న మార్కెట్‌ను అనుసరించి డెయిరీ ఉత్పత్తులను ఆన్‌లైన్ ఆర్డర్‌తో సప్లయి చేస్తున్నాం. ప్రస్తుతం 16 జిల్లాల్లో పాలు సేకరిస్తూ విక్రయిస్తున్నాం. త్వరలో మరో నాలుగు జిల్లాల్లో పాల అమ్మకాలను ప్రారంభిస్తాం.

అక్రమ నిర్మాణం కూల్చివేత



అక్రమ నిర్మాణం కూల్చుతున్న మున్సిపల్ సిబ్బంది

మంథని, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎరులగూడెంలోని ఓ అపార్టుమెంట్ సమీపంలో అక్రమ నిర్మాణాన్ని మున్సిపల్ సిబ్బంది ఎక్స్‌కావేటర్‌తో కూల్చి వేశారు. దాదాపు రెండు గుంటల విలువైన ఖాళీ స్థలాన్ని ఓ వ్యక్తి ద్వారా కొందరు అక్రమంగా రిజిష్ట్రేషన్ చేయించుకొని ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడంపై ఫిర్యాదులు, కోర్టు కేసులు నమోదయ్యాయి. దీంతో మున్సిపల్ అధికారులు సదురు అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేశారు. ఈ వ్యవహారంలో మరింత లోతుగా విచారణ జరిపి బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది, మాజీ ఉప సర్పంచ్ ఇనుముల సతీష్ కోరారు.

భూ వివాదంలో రాళ్ల దాడి

- తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న విద్యాసాగర్

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 18: మండలంలోని వేంపేట గ్రామంలో ఓ భూ వివాదం శనివారం రాళ్ల దాడికి దారి తీసింది. దీంతో తండ్రి పందిరి గంగాధర్, కొడుకు పందిరి విద్యాసాగర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివారల ప్రకారం..గ్రామానికి చెందిన పందిరి గంగాధర్‌కు అదే గ్రామానికి చెందిన దేశబోయిన గంగారంతో కొంత కాలం నుంచి భూ వివాదం ఉంది. శనివారం పందిరి గంగాధర్ ఇంటి ముందు ఫోన్ మాట్లాడుతున్న సమయంలో దేశబోయిన గంగారంతో పాటు దేశబోయిన రామకృష్ణ, దేశబోయిన మహేష్ వచ్చి భూమి గురించి మాట్లాడుతుండగా మాట మాట పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో దేశబోయిన గంగారం, దేశబోయిన రామకృష్ణ, దేశబోయిన మహేష్ పదునైన రాళ్లతో దాడి చేయడంతో పందిరి గంగాధర్ తలకు, విద్యాసాగర్‌లకు మెడకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పందిరి విద్యాసాగర్ భార్య ఫిర్యాదు మేరకు మెట్‌పల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పందిరి గంగాధర్, విద్యాసాగర్‌చ లక్ష్మి తమపై దాడి చేశారని దేశవేని చిన్న గంగారాం ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు.

బాలురిపై దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌లోని జువైనల్ హోంలో మైనర్‌లపై లైంగికదాడికి పాల్పడిన రహమాన్, ఇతరులపై చర్యలు తీసుకోవాలనంటూ న్యాయవాది, సామాజిక కార్యకర్త సర్దార్ సోహన్‌సింగ్ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్(డీపీయూ)కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జువైనల్ హోంలో శిక్ష అనుభవిస్తున్న బాలుర‌పై లైంగికదాడికి పాల్పడిన గార్డు రహమాన్‌తో పాటు ఇతరులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు ఎంతమందిపై ఇటువంటి దాడులు జరిగాయనే దానిపై లోతుగా విచారణ జరపాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

వరద కాలువ భూములు ఆక్రమించారని ఫిర్యాదు



ఆర్‌డీఓకు వినతిపత్రం అందిస్తున్న పెగ్గెర్ల గ్రామస్థులు

కథలాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగ్గెర్ల శివారులో ఉన్న వరద కాలువకు సంబంధించిన భూములు ఆక్రమణకు గురవుతున్నాయని వాటిని కాపాడాలని కోరుతూ గ్రామస్థులు శనివారం కోరుట్ల ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. పెగ్గెర్లలో 113 ఎకరాల భూమిని వరద కాలువలో కోల్పోయామని మిగులు భూములను తాము మార్కెట్ అవసరాలకు వాడుకుంటున్నామని పేర్కొన్నారు. మిగులు భూములను కొందరు అక్రమించుకుని మార్కెట్‌కు స్థలంలేకుండా చేస్తున్నారని వాపోయారు. వరద కాలువ హద్దులు నిర్ణయించి మార్కెట్‌కు వినియోగించుకునేలా చూడాలని కోరారు.

వెల్ది రహదారిపై కల్వర్టుకు బుంగ



వెల్దిలో కల్వర్టుకు పడ్డ బుంగ

మానకొండూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్ది గ్రామ శివారులోని వేగురుపల్లి ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టుకు బుంగ పడింది. ఇటీవల కురిసిన బారీ వర్షాలకు కల్వర్టుకు బుంగ పడినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. కరీంనగర్ నుంచి వేగురుపల్లి వరకు ప్రతి రోజు ఆర్టీసీ బస్సు, ఇతర వాహనాలు వెళ్తుంటాయి. సింగిల్ రోడ్డు కావడంతో రాత్రి వేళలో ఎదురెదురుగా వచ్చే వాహనాల వెలుతురుకు బంగ కనబడడం లేదని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా ఆలయ పునరుద్ధరణ మహోత్సవం



మక్కాన్‌సింగ్‌ను సన్మానిస్తున్న సంతోష్‌రావు దంపతులు

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఐబీకాలనీలోని విఘ్నేశ్వర- భక్తాంజనేయ స్వామి ఆలయ పునరుద్ధరణ మహోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంబటి సరోజిని- మల్లిఖార్జున్‌రావు, కుమారుడు-కోడలు అంబటి సంతోష్‌రావు-అర్చన ఆధ్వర్యంలో ఆలయ పునరుద్ధరణ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే సతీమణి మనాలీఠాకూర్, సింగరేణి ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఏసీపీ మడత రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ ఇంద్రసేనారెడ్డి, రాజేశ్వర్‌రావు, ఎస్‌ఐలు ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నాయకులు కందుల పోచం సంధ్యారాణి, సోమారపు లావణ్య అరుణ్, బీఆర్‌ఎస్ నాయకులు కౌశిక లత హరిదంపతులతో పాటు కాలనీవాలసులు పాల్గొన్నారు. శనివారం రాత్రి ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌ను అంబటి సంతోష్‌రావు దంపతులు సన్మానించారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు మోక్షమెప్పుడో..?

- మూడేళ్లు దాటినా పూర్తికాని పనులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



అసంపూర్తిగా నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్

చొప్పదండి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. పనులు ప్రారంభమై మూడేళ్లు దాటినా ఎక్కడ వేసినా గొంగలి అక్కడే అన్న చందాన మారింది. 50 శాతం నిర్మాణం పూర్తయ్యాయి. మున్సిపాలిటీగా మారిన చొప్పదండిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం మూడేళ్ల క్రితం రెండు కోట్ల రూపాయల నిధులను కేటాయించి పనులను ప్రారంభించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు ఆర్భాటంగా పనులను ప్రారంభించారు. నిధుల లేమి కారణంగానే పనులు నిలిచిపోయినట్లు సమాచారం.

● మార్కెట్ యార్డులో నిర్మాణం...

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం పట్టణంలో సరైన స్థలం దొరకకపోవడంతో చొప్పదండిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఎకరన్నర స్థలాన్ని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కోసం కేటాయించారు. వ్యవసాయ మార్కెట్ స్థలం కేటాయించడంపై రైతు సంఘాలతోపాటు పలువురు వ్యతిరేకించారు. మార్కెట్‌లో రైతుల ధాన్యం నిల్వ కోసం స్థలం లేకపోవడంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంతో ఇరుకుగా మారింది.

● అసాంఘిక కార్యకలాపాలకు నిలయం



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో రెండు షెడ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. మార్కెట్ ఆవరణలోనే చివరన ఈ నిర్మాణం చేపట్టగా అటువైపు వెళ్లేవారే కరువవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తోపాటు పట్టణంలో సెంట్రల్ లైటింగ్, అభివృద్ధి పనులలో భాగంగా ప్రధాన రహదారి వెడల్పు చేశారు. ఈ నేపథ్యంలో రోడ్డుపై పండ్లు, కూరగాయలు విక్రయించే చిరువ్యాపారులు దుకాణాలను కోల్పోయారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభమైతే తమ వ్యాపారాలను తిరిగి ప్రారంభించుకోవాలని వారు ఎదురుచూస్తున్నారు. ప్రతి శుక్రవారం చొప్పదండిలో నిర్వహించే వారసంత రోడ్డుపైనే కొనసాగుతుండడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కార్యాలయం, 30 పడకల ఆసుపత్రి, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, పోలీస్ స్టేషన్, పోలీస్ క్వార్టర్స్, మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాలు వరుసగా ఉన్న ఈ రోడ్డుకిరువైపులా వారసంత కొనసాగుతుండడంతో అటు విక్రయదారులతోపాటు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు వేములవాడకు శృంగేరి పీఠాధిపతి రాక

● ఘనస్వాగతానికి కాంగ్రెస్ నాయకుల ఏర్పాట్లు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామి క్షేత్రానికి శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతిస్వామి ఆదివారం చేరుకోనున్నారు. రాష్ట్రంలో చేపట్టిన ధర్మవిజయ యాత్రలో భాగంగా ఆదివారం సాయంత్రం వేములవాడకు చేరుకోనున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. భీమేశ్వర ఆలయంలో నిర్వహించే అభివృద్ధి పనులు, రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని తెలంగాణ చౌక్ నుంచి రాజన్న ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించనున్నారు. 7.30 గంటలకు ధూళిపాద పూజ, 8గంటలకు అనుగ్రహభాషణం, 9 గంటలకు చంద్రమౌళీశ్వర పూజలు నిర్వహించనుండగా, సోమవారం ఉదయం 8 గంటలకు విధుశేఖర భారతిస్వామి రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకోనున్నారు. 9 గంటలకు భీమేశ్వర ఆలయం సమీపంలోని శృంగేరి శంకర మఠం కుంబాభిషేకంలో, రాత్రి 11 గంటలకు జగద్గురువుల దర్శనం, పాదుకాపూజ ఆలయ ప్రాంగణంలో భిక్షా వందనం ఉంటుంది.

ధర్మవిజయ యాత్రలో భాగంగా వేములవాడకు విచ్చేస్తున్న శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతిస్వామికి ఘనస్వాగతం పలికేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాంగ్రెస్ నాయకులు జగద్గురుకు స్వాగతం పలికేందుకు కట్టిన ఫ్లెక్సీలతో పట్టణం నిండిపోయి కనిపిస్తోంది. అలాగే ఆలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు, బీజేపీ నేత ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కోరుట్ల నుంచి అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక బస్సు

కోరుట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని కోరుట్ల నుంచి వచ్చే నెల 3వ తేదీన అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక బస్సు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ మనోహర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేదీన సూపర్ లగ్జరీ బస్సు సాయత్రం నాలుగు గంటలకు కోరుట్ల బస్టాండ్ నుంచి ప్రారంభమై కరీంనగర్ మీదుగా 4వ తేదీన హైదరాబాద్ నుంచి కాణిపాకం చేరుకుంటుందని తెలిపారు. కాణిపాకం దర్శనం ముగిసిన అనంతం అదే రోజు గోల్డెన్ టెంపుల్ దర్శనం ఉంటుందన్నారు. అక్కడి నుంచి 5వ తేదీ ఉదయం ఐదు గంటల వరకు అరుణచల క్షేత్రానికి చేరుకుంటుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో 6వ తేదీన మహానంది, గద్వాల జోగులాంబ అమ్మవారి దర్శనం ఉంటుందని సాయత్రం వరకు కోరుట్ల పట్టణానికి చేరుకుంటుందని తెలిపారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం బోజనం, రాత్రి అల్పహారం సదుపాయం కల్పించి ట్రిప్‌కు పెద్ద వారికి రూ. 5,500, పిల్లలకు రూ.4,180 చార్జీ ఉంటుందని తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య

హుజూరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో ఐటీఐ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన మోరే రిషి జమ్మికుంటలో ఐటీఐ చదువుతున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల వివరాలు తెలియాల్సి ఉంది.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను తీగలగుట్టపల్లి వద్ద పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌లు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

ఓదెల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హరిపురంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు అమ్ముల మల్లయ్య అనే రైతుకు చెందిన ఏపీ 15 ఏహెచ్ 7002 అనే నెంబర్ గల ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఉదయం హరిపురం రైల్వే గేట్ నుంచి పెగడపల్లి వైపు వెళ్లే దారిలో కెనాల్ పక్కన పార్కింగ్ చేసి, పొలాన్ని చూడడానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి నిలిపి ఉన్న బైక్ కనబడలేదని బాధితుడు తెలిపారు. పొత్కపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు మల్లయ్య తెలిపారు.

సీఎంఆర్ రికవరీ అయ్యేనా?

● ప్రభుత్వానికి బియ్యం అప్పగించడంలో మిల్లర్ల మీనమేషాలు



బోర్నపల్లిలో పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేస్తున్న అధికారులు (ఫైల్)

హుజూరాబాద్ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేసిన ధాన్యాన్ని మరాడించి బియ్యంగా మార్చి తిరిగి అప్పగించడంలో రైస్ మిల్లర్లు తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారు. నిర్ణీత గడువు ముగిసినప్ప టికీ లక్ష్యం మేరకు సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) ఇవ్వని మిల్లులపై సంబం ధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శించడం కలకలం రేపుతోంది. హుజూరాబాద్ మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలోని రవిచంద్ర ఇండస్ట్రీస్‌లో అధికారులు దాడులు జరుపగా 2022-23లో సంబంధించిన సీఎంఆర్ ధాన్యం, 2024-25 సీజన్‌లో 80,006.40 టన్నుల బియ్యం అప్పగించగా 7134.80 టన్నుల బియ్యం తేడా వచ్చినట్లు అధికారులు గుర్తించారు. అలాగే శంకరప ట్నం మండలం తాడికల్ గ్రామంలోని రాజరాజేశ్వరి ఇండస్ట్రీస్‌లో 63,821.60 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అప్పగించగా, 14,992.40 మెట్రిక్ టన్నుల ధాన్యం తేడా వచ్చినట్లు అధికారులు గుర్తించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

● ఒకరికి తీవ్ర గాయాలు

కథలాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరికొండ శివారులో శుక్రవారం రాత్రి బైక్‌ను కారు అతివేగంగా ఢీకొట్టిన ఘటనలో చెట్‌పల్లి అంజయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు. అంజయ్య సిరికొండ నుంచి కథలాపూర్ వైపు వస్తుండగా తాగిన మైకంలో ఉన్న హరిదాస్ అనే వ్యక్తి కారుతో ఎదురుగా వచ్చి అంజయ్యను ఢీకొట్టాడు.

ఈ ఘటనలో అంజయ్య తల కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ పంపినట్టు తెలిపారు. కారును స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. క్షతగాత్రుని కొడుకు అభినవ్ ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

● 2 తులాల బంగారం, రూ.30 వేలు స్వాధీనం



అల్లెపు కృష్ణ

ధర్మారం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా కనిపించే వృద్ధ మహిళలను అనుసరిస్తూ వారికి పెన్షన్ ఇప్పిస్తా అని మాయ మాటలతో నమ్మించి బంగారు ఆభరణాలు దొంగిలించే అంతర్ జిల్లా దొంగ అల్లెపు కృష్ణను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 10న ధర్మారం చెందిన బుధరపు శంకరమ్మ అనే వృద్ధురాలిని తాను పంచాయతీ సెక్రెటరీనని, ఆమె మెడలోని చైన్ తీసి ఫొటో దిగి బ్యాంకు ఉద్యోగికి పంపిస్తే పెన్షన్ వస్తదని నమ్మించాడు. రెండు తులాల బంగారు గొలుసుని తీసి ఇవ్వగా దానిని తీసుకుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమా ర్‌ల సూచనల మేరకు వివిధ జిల్లాలలో ఇదే నేర విధానం ఉండి పలు కేసులలో నిందితుడైన అల్లెపు కృష్ణను అనుమానించి ధర్మారంలో అరెస్ట్ చేశారు. నేరస్తుడు ధర్మపురిలో చేసిన దొంగతనం కూడా ఒప్పుకున్నాడు. నేరస్తుడిపై వివిధ జిల్లాల్లో 96 కేసులు నమోదయ్యాయని, జైలు నుంచి విడుదలై కరీంనగర్ మారుతినగర్‌లో కిరాయికి ఉంటూ మళ్లీ పాత విధానంలోనే దొంగ తనానికి పాల్పడుతున్నట్లు తెలిపారు. జూలై 7న ధర్మపురిలో ఓ వృద్ధురాలిని ఇదే విధంగా నమ్మించి 2 తులాల బంగా రు గొలుసును అపహరించాడు. పట్టుబడ్డ కృష్ణ నుంచి 2 తులాల బంగారు గొలుసు, రూ. 30 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నేరస్తుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సై ప్రవీణ్ కుమార్, సిబ్బందిని ఏసీపీ కృష్ణ అభినందించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి



వీణవంకలో సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్సై ఆవుల తిరుపతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్న పోలీసులు శనివారం అప్పగించారు. కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని చల్మెడ ఆనందరావు ఆస్పత్రి వద్ద మణిదీప్ గత నెల 29న ఫోన్ పోగొటుకున్నాడు. మార్చి 24న శంకరయ్య అనే వ్యక్తి తీగలగుట్టపల్లి వద్ద ఫోన్‌ను పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోన్‌లు ఆదిలా బాద్, నిజామాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి ఫోన్‌లను యజమానులకు స్టేషన్‌లో అప్పగించారు.

● వీణవంక : మండలంలోని మాల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాయవేణి సాగర్ సెల్‌ఫోన్ మే నెలలో పోగొట్టుకోగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో కానిస్టేబుల్ రఘుపతి గుర్తించి స్వాధీనం చేసుకోగా శనివారం ఎస్‌ఐ ఆవుల తిరుపతి సాగర్‌కు అందజేశారు.

శ్రీరాంసాగర్ వరద గేట్ల మూసివేత

జగిత్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు తగ్గుము ఖం పట్టడంతో శనివారం వరద గేట్లను మూసివేశారు. ఎగువ ప్రాంతం నుంచి 5,654 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీలు ఉంది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కథలాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని తక్కళ్లపల్లి శివారులోని పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం తెల్లవారుజామున రెవెన్యూ అధికారులు పట్టుకున్నా రు. వెంకటేశ్ అనే వ్యక్తి తక్కళ్లపల్లి వాగు నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్టు వచ్చిన సమాచా రం మేరకు గ్రామ పాలనాధికారి ఆధ్వర్యంలో సిబ్బం ది పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశామని ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

తండ్రిని తిడుతున్నాడని కత్తితో దాడి

మల్యాల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తన తండ్రిని తిడుతున్నాడని ఓ బాలుడు కత్తితో దాడికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజారం గ్రామానికి చెందిన బక్కశెట్టి రాకేశ్ ఓ వ్యక్తి ఇంటికి శుక్రవారం రాత్రి వెళ్లి ఇరువురు మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో వారి చర్చ వాదనకు దారి తీసింది. దీంతో రాకేశ్.. తన తండ్రిని తిడుతున్నాడనే నెపంతో కొడుకు ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకు వచ్చి రాకేశ్ నడుముపై దాడి చేయడంతో తీవ్రగా యాలయ్యాయి. రాకేశ్ నానమ్మ బూదమ్మ ఫిర్యాదు మేరకు బాలుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ మహేష్ .బి .గితే

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. విద్యార్థులు, యువత గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండి పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వీర్నపల్లి మండలం సీతారాంనాయక్ తండాలో నార్కోటిక్ ఎస్పీ భూక్య రాంరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ ధూమనాయక్ భూక్య గారి సామాజిక సేవ ట్రస్ట్ వారు నిర్వహించిన 'మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల' పై అవగాహన సదస్సులో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్.బి.గితే మాట్లాడుతూ గంజాయి రహిత సమాజం కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. మత్తుకు బానిసగా మారి బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోకూడదని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనించి సమయానుకులంగా మార్గనిర్దేశం చేయాలని అన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. విద్యార్థులు, యువత సోషల్ మీడియా, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు. మత్తు పదార్థాలు వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. గర్జనపల్లి గ్రామానికి చెందిన నార్కోటిక్ ఎస్పీ భూక్య రాంరెడ్డి శ్రీ ధూమనాయక్ భూక్య సామాజిక సేవ ట్రస్ట్‌ను స్థాపించి మారుమూల గ్రామీణ ప్రాంతంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎస్పీ మహేష్. బి.గితే అన్నారు. కార్యక్రమంలో నార్కోటిక్ ఎస్పీ భూక్య రాంరెడ్డి, సంస్థ చైర్‌పర్సన్, వ్యవస్థాపకురాలు భూక్య విజయ, ప్రధాన కార్యదర్శి భూక్య రాంసాయికిరణ్ రామావత్, ఉపాధ్యక్షురాలు భూక్య నందిత రమావత్, ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ లక్ష్మన్, ఎంఈవో శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రవి, ఉపాధ్యాయులు, తండాపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ బాలుడికి అండగా ఉంటా

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



బాలుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అనాథ బాలుడికి అండగా ఉంటానని, భవిష్యత్‌లో బాలుడికి అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీ ఇచ్చారు. మండలంలోని రాగంపేటకు చెందిన అనాథ బాలుడు స్వాద్విన్ కుమార్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కలిసి 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. కలెక్టర్‌తో మాట్లాడి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు.

రాగంపేట జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు 12,500 రూపాయల ఆర్థిక సాయాన్ని దీకొండ స్వాద్విన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దినకర్, ఉపాధ్యాయు లు కర్ర వెంకటరాంరెడ్డి, గంగేశం, శ్రీనివాస్, నర్సయ్య, రజియుద్దీన్, రాజ్‌కుమార్, యుగేందర్, శంకరయ్య, వీరేశంలు పాల్గొన్నారు.

రాజన్నకు ప్రత్యేక పూజలు

- నరకచతుర్ధశి రోజు ప్రత్యేక కార్యక్రమాలు
- ఈ నెల 22 నుంచి నవంబరు 20 వరకు కార్తీక మాసం



వేములవాడ కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం నరకచతుర్ధశి సందర్భంగా శ్రీరాజరాజేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయాత్పూర్వం 3.30 గంటల నుంచి 3.40 వరకు మంగళవాయిద్యాలు, 4.20 గంటల నుంచి సుప్రభాత హారతి, 4.30 నుంచి 4.40 వరకు నరకచతుర్ధశి, దీపావళిపండగ మంగళహారతి అభ్యంగనము చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం 4.40 గంటల నుంచి 5 గంటల వరకు ఆలయ శుద్ధి 5 గంటల నుంచి శ్రీస్వామి వారికి ప్రాతఃకాల పూజ నిర్వహించగా సాయంత్రం 4 గంటల నరకాసురవధ పురాణ కాలక్షేపము తదుపరి 6.30 గంటలకు కల్యాణమండపంలో ధనలక్ష్మీపూజ సోమవారం ఉదయం శ్రీస్వామి వారికి నిత్యకల్యాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

● కార్తీక మాసం పూజలు

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 22 నుంచి నవంబరు 20వ తేదీ వరకు కార్తీక మాసం సందర్భంగా ప్రతి సోమవారం రాజన్నకు, పరివార దేవతలకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, లింగార్చన నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి సోమవారం ఏకాదశి రోజులలో శ్రీసత్యనారాణ స్వామి వ్రతములు మధ్యాహ్నం 1 గంటలకు మార్చినట్లు తెలిపారు. 2వ తేదీ ఆదివారం రోజున కార్తీక శుద్ధ ద్వాదశి రోజున ఉదయం 6.30 గంటలకు శ్రీరుక్మిణీ, విఠలేశ్వరస్వామి వారికి పంచపనిషద్వారా అభిషేకం, సాయంత్రం 6.35 శ్రీకృష్ణతులసీ కల్యాణం నిర్వహిస్తారు. 4వ తేదీ మంగళవారం రోజున వైకుంట చతుర్ధశి సందర్భంగా శ్రీఅనంతపద్మనాభ స్వామి వారికి పంచో ఎనిషత్ ద్వారా అభిషేకం నిర్వహిస్తారు. ఉదయం 10 గంటలకు ప్రధాన, పరివారం శివాలయములలో అన్నపూజలు చేస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి శ్రీఅనంతపద్మనాభస్వామి వారికి అభిషేకము, శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి మహాపూజ, పొన్న చెట్టుసేవ ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 5వ తేదీన బుధవారం కార్తీక పౌర్ణమి రోజు రాత్రి ప్రదోషకాల పూజ 8 గంటలకు జ్వాలా తోరణము రాత్రి నిశిపూజ అనంతరం 10.15 శ్రీరాజరాజేశ్వర స్వామి వారికి మహాపూజ నిర్వహిస్తారు. కార్తీక మాసం పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీ నుంచి నవంబరు 20వ తేదీ వరకు ఉదయం 7 గంటలకు కార్తీక పురాణ ప్రవచనములు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వెలుగు జిలుగుల దీపావళి



- టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి
- పెద్దలు దగ్గర ఉండి పిల్లలను గమనించాలి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ రోజు దీపాలు, టపాసుల మోతతో సంబరాలు అంబరాన్నంటుతాయి. పండగపూట అపశృతులు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటే ఆనందోత్సాహాల మధ్య సాగిపోతుంది. ముఖ్యంగా పిల్లలు టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు, పెద్దలు జాగ్రత్తగా ఉండాలి. దీపావళి రోజున ప్రమాదాలు జరుగకుండా ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏటా ఎక్కడో ఒక చోట అగ్ని ప్రమాదాలు సంభవించి ఆస్తి, ప్రాణ నష్టం సంభవిస్తున్నాయి. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి.

- టపాసులు కాల్చే సమయంలో కాటన్ దుస్తులు వేసుకోవాలి.
- పెద్దల సమక్షంలోనే కాల్చేందుకు పిల్లలను అనుమతించాలి.
- ఇంటి బయట, బహిరంగ ప్రదేశంలోనే కాల్చాలి.
- పూర్తిగా పేలని బాంబులపై నీరు లేదా ఇసుకనుచల్లి నిప్పునుచల్లార్చాలి.
- మండుతున్న క్రాకర్స్‌ను ఎప్పుడు శరీరానికి, దుస్తులకు దూరంగా ఉంచాలి.



- రాకెట్స్, ఫైర్ క్రాకర్స్‌ను గుడిసెలు, పెట్రోల్ బంక్‌లకు దూరంగా కాల్చాలి.
- క్రాకర్స్‌ను ఎప్పుడూ హర్డ్ సర్ఫేస్‌పైనే ఉంచాలి.
- టపాసులపై వంగి అంటించవద్దు. విష పూరితమైన గ్యాస్‌ను పీల్చుకుంటే అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది.
- దుస్తులకు నిప్పు అంటుకుంటే పరుగెత్తవద్దు, నేలపై దొర్లాలి. దుప్పటి చుట్టుకోవాలి.
- చిన్న పిల్లలకు అందుబాటులో టపాసులు ఉంచవద్దు.
- అగ్గిపుల్లలకు, దీపాలకు, గ్యాస్‌సిలండర్లకు దూరంగా ఉంచాలి.
- టపాసులు కాల్చే స్థలంలో ఎప్పుడు రెండు బకెట్ల నీటిని సిద్ధంగా ఉంచుకోవాలి.
- టెరికాటన్ వంటి దుస్తులు ధరించవద్దు.
- తారాజువ్వలను ఆకాశంలోకి వెళ్లేలా కాల్చాలి. తారాజువ్వలను పక్కకు పెట్టి కాల్చితే ఇళ్లలోకి దూసుకెళ్లి అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశముంటుంది.
- టపాసులను చేతిలో పట్టుకొని అంటించరాదు.

లైసెన్స్‌దారులు పాటించాల్సిన నిబంధనలు

- టపాసుల షాపులను లే అవుట్ ప్రకారం జీఐ షీట్లతో అగ్ని ప్రమాద రహితంగా ఏర్పాటు చేయాలి.
- ప్రమాదం సంభవిస్తే ఫైర్ ఇంజన్ వెళ్లేలా దుకాణాల మధ్య దారి, మంటలు ఒక దుకాణం నుంచి మరో దుకాణానికి వ్యాపించకుండా ఖాళీ స్థలం మూడు మీటర్ల వరకు వదలాలి.
- ప్రతి దుకాణంలో రెండు ఫైర్ ఎస్టింగిషర్ (5 కిలోల సామర్థ్యం) పరికరాలు ఉండాలి.
- 200 లీటర్ల నీటితో నిండిన రెండు వాటర్ బ్యారెల్స్, మూడు వాటర్ బకెట్స్, మూడు ఇసుక బకెట్స్ షాపు వద్ద ఏర్పాటు చేయాలి.
- టపాసుల షాపులో 18 ఏళ్లలోపు ఉన్నవారిని పనిలో పెట్టుకోకూడదు.
- విదేశీ టపాసులు విక్రయించరాదు.
- అన్ని షాపుల్లో విద్యుత్ సరఫరాకు సంబంధించి లూజ్ వైరింగ్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- దుకాణాల్లో ఎల్‌ఈడీ బల్బులను వినియోగించాలి.

ఇళ్లకు కొండెంగల పోస్టర్లు

● కోతుల బెడద నుంచి తప్పించుకునే ప్రయత్నం


ఇంటి గోడకు అంటించిన కొండెంగ పోస్టర్

గంభీరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కోతుల బెడదతో ప్రజలు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ఇంట్లో ఉన్నా.. బయటకు వెళ్లినా కోతులతో ప్రజలు వేగలేకపోతున్నారు. పాలకులు, అధికారులకు బాధ చెప్పినా ప్రయోజనం లేదని భావించిన ప్రజలు ఇళ్లకు కొండెంగల పోస్టర్లను అతికిస్తున్నారు. ఇంటి లోపల, బయట గోడలపై కొండెం గల పోస్టర్లను చూసిన కోతులు భయంతో పరిగెడుతున్నాయని, కొంతైనా కొండెంగల పోస్టర్లతో కోతుల బెడద తప్పిందని ప్రజలు పేర్కొంటున్నారు.

కారోబార్‌ను తొలగించాలని గ్రామస్థుల ధర్నా


శ్రీనివాస్‌నగర్‌లో ధర్నా చేస్తున్న గ్రామస్థులు

మానకొండూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామ కారోబార్ బొల్లం శ్రీనివాస్‌ను తొలగించాలని గ్రామస్థులు శనివారం ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో కారోబార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామంలో అధిక ఇంటి పన్నులు వసూలు చేస్తున్నాడని గ్రామస్థులు ఆరోపించారు. ధర్నాలో మియాపురం లక్ష్మణాచారి, చందు, సతీష్, శేఖర్, అరుణ్, అబిలాష్, శ్రీకాంత్, అనిల్, కిరణ్, వెంకటేశ్, హరీశ్, కుమార్ తదితరులు ఉన్నారు.

గోదావరి మహాహారతి కోసం స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న రాష్ట్ర కో కన్వీనర్ దామెర రాంసుధాకర్‌రావు

ధర్మపురి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నదీ తీరాన నిర్వహించే గోదావరి మహా హారతి కోసం రాష్ట్ర కో కన్వీనర్ దామెర రాంసుధాకర్‌రావు శనివారం స్థల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా నిర్వహించే విధంగా నవంబరు 9న అత్యంత వైభవంగా గోదావరి మహా హారతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం స్థల పరిశీలన, అలాగే సాంస్కృతిక కార్యక్రమాల గురించి చర్చించి, గోదావరి హారతి కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గోదావరి మహా హారతి కమిటీ సభ్యులు బండారి లక్ష్మణ్, గాజు భాస్కర్, బెజ్జారపు లవణ్, దొనకొండ నరేష్, కుమ్మరి తిరుపతి, ఒగేటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండిలో మార్క్‌ఫెడ్ మక్కల కొనుగోలు కేంద్రం

- పండగ తర్వాత ప్రారంభం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



చొప్పదండి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌లో దీపావళి పండగ తర్వాత మార్క్‌ఫెడ్ మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం కానున్నది. ఈ నెల 17న 'మక్కలకు లభించని మద్దతు' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కాగా స్పందించిన మార్కెట్ ఛైర్మన్ కొత్తూరి మహేష్ ఎమ్మెల్యే దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఉన్నతాధికారులతో మాట్లాడగా పండగ తర్వాత చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌లో మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. చొప్పదండి మార్కెట్ కమిటీలో మక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు కానుండగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ


కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులు


కొండగట్టు అంజన్న ఆలయంలో పీఠాధిపతి, అర్చకులు

మల్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం మంగళవారం వేలాదిగా వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. వేకువజాము నుంచే తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయంలో స్వామి వారికి మొక్కులు చెల్లించుకొని బేతాళుడు, రాముల వారి వద్ద కూడా పూజలు చేశారు. రాష్ట్ర బంద్ అయినప్పటికీ వాహనాల్లో తరలివచ్చి అంజన్నను దర్శించుకున్నారు. ఆలయంలో అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, నిత్య పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.

● సనాతన ధర్మాన్ని కాపాడాలి

సనాతన ధర్మాన్ని కపాడడమే లక్ష్యంగా ఆలయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సంగారెడ్డి జిల్లా బర్ధిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి సిద్దేశ్వర గిరి మహారాజ్ పేర్కొన్నారు. కొండగట్టు ఆంజనేయ స్వామిని శనివారం దర్శించుకున్నారు. ఆలయంకు వచ్చిన వారికి ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.

● రాజన్నను దర్శించుకున్న దత్తగిరి మహారాజ్

వేములవాడ కల్చరల్ : వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వావివారిని సంగారెడ్డి జిల్లా బర్దిపూర్‌కు చెందిన గిరి మహారాజ్ శనివారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో స్వాగతం పలికారు.

● ధర్మపురిలో పూజలు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని దత్తగిరి మహారాజ్ ఆశ్రమానికి చెందిన అవధూత గిరి మహారాజ్ శనివారం రాత్రి సందర్శించారు. అనంతరం శ్రీ స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆయన యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజించారు.

జీవో 61ని అమలుచేయాలి

గ్రామపంచాయతీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి

వేములవాడ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి గ్రామపంచాయతీ కార్మికులకు 51 జీవో శాపంగా మారిందని దాన్ని రద్దు చేసి, కార్మికులకు 61 జీవోను అమలు చేయాలని గ్రామపంచాయతీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. వేములవాడ పట్టణంలోని ఏఐటీయూసీ అనుబంధ గ్రామపంచాయతీ కార్మికుల జిల్లా మహాసభ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పులను గౌరవించకుండా కేసీఆర్ మల్టీ పర్పస్ విధానం తీసుకుని వచ్చి పెన్నుపట్టే వారిని కూడా పారపట్టేలా చేశారని విమర్శించారు. నాలుగు నెలలు గడిచిన వేతనాలు వచ్చే పరిస్థితి లేదన్నారు. వారంతపు సెలవు దశల వారీగా వారంలో ఒక్క రోజు పూర్తి సెలవు ఇవ్వాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని, జనాభా పెరుగుదలకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వెంకటరాజం, వేణు, కడారి రాములు ఉన్నారు.

చోరీ కేసులో నిందితుల ఆచూకీ గుర్తింపు?

జగిత్యాలరూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలంతో పాటు జిల్లాలో పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న మహారాష్ట్రకు చెందిన ముఠా పోలీసులకు చిక్కినట్లు సమాచారం. మహారాష్ట్రలోని నాందేడ్ సమీపంలోని ఓ గ్రామంలో పోలీసులు నిందితులతో పాటు ఇళ్లను గుర్తించినట్లు తెలిసింది. నిందితులను పట్టుకొని రావడానికి రెండు పోలీసు బృందాలు శనివారం నాందేడ్ బయల్దేరి వెళ్లినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

● మూడు బృందాలతో గాలింపు

ధరూర్‌లో గత ఆదివారం నలుగురు సభ్యులతో కూడిన మహారాష్ట్రకు చెందిన ముఠా పలు ఇళ్ల తాళాలు పగులకొట్టి నగదు, బంగారాన్ని ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాలు, వేలిముద్రల ఆధారంగా మూడు ప్రత్యేక టీమ్‌లకు బాధ్యతలు అప్పగించారు. దీంతో పోలీసులు గాలింపు చేస్తుండగా నిందితులు పోలీసులకు చిక్కినట్లు విశ్వసనీయ సమాచారం. ముఠా పోలీసులకు చిక్కితే భారీగా సొమ్ము రికవరీ అయ్యే అవకాశం ఉంది. ఇదే ముఠా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోనూ చోరీలకు పాల్పడినట్లు భావిస్తున్నారు.

స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుపొందాలి


కొమురయ్యను సన్మానిస్తున్న యాదవ సంఘాల నాయకులు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులు ఉమ్మడి జిల్లాలో అత్యధిక స్థానాల్లో గెలుపొందాలని అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి జిల్లా కన్వీనర్, ట్రస్మా రాష్ట్ర కన్వీనర్ సొగాని కొమురయ్యయాదవ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వివేకానంద విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా యాదవ మహాసభ సమావేశంలో సొగాని కొమురయ్య యాదవ్‌ను ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న మానకొండూర్ మండలం చెంజర్లలోని అరవింద ఫామ్ హౌస్‌లో యాదవులకు రాజకీయ అవగాహన కోసం ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో పోటీచేసే ఆలోచన ఉన్న యాదవ కులస్తులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణ యాదవ్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఏటీ యాదవ్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు పలుమారు మల్లేశం, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సందెవేణి రాజేందర్, కన్నెబోయిన ఓదెలు, చెర్ల పద్మ, మాజీజడ్పీటీసీ గంట రాములు, దుండు రాజన్న, కాల్వ మల్లేశ్, బండి మల్లయ్య, జంగ కొమురయ్య, కొండ రవి, బబ్బురి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిమ్స్‌కు పీజీ సీట్ల మంజూరుపై సంబరాలు


కళాశాలలో కేక్‌కట్ చేస్తున్న ప్రిన్సిపాల్, వైద్య విద్యార్థులు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌కు 16 పీజీ సీట్లు మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ హిమబిందు ఆధ్వర్యంలో వైద్య అధ్యాపకులు, మెడికోలు కేక్‌కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ హిమబిందు మాట్లాడుతూ 2022లో ప్రారంభమైన మెడికల్ కళాశాల 150సీట్లతో ప్రారంభమైందని, ఈ విద్యా సంవత్సరంలో 4వ సంవత్సరంలోకి అడుగు పెడుతుందన్నారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల, పారామెడికల్ డిప్లొమా కోర్సుతో పాటు ఈ ఏడాది ఎమర్జెన్సీ మెడిసిన్‌లో 4, అర్థోపెడిక్‌లో 4, ఓబీజీవైలో 4, బయో కెమిస్ట్రీలో 4 పీజీ సీట్లు రావడం ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చొరవతో 4వ సంవత్సరం ఎంబీబీఎస్ పూర్తికాక ముందే సిమ్స్‌లో పీజీ సీట్లు వచ్చాయన్నారు. మూడు సంవత్సరాల పీజీ కోర్సుల్లో మరో రెండు పిడియాట్రిక్, జనరల్ మెడిసిన్ కోర్సులకు కూడా త్వరలోనే పీజీ సీట్లు మంజూరవుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్ఎంఓ దండె రాజు, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, ప్రొఫెసర్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఎస్‌యూ పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ రెగ్యులర్ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజు షెడ్యూల్‌ను శనివారం యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డి.సురేష్ కుమార్ విడుదల చేశారు. పరీక్షలు నవంబరు 13 నుంచి నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నామన్నారు. ఈ నెల 27లోగా పరీక్ష ఫీజు 300 రూపాయలు, అపరాధ రుసుముతో ఈ నెల 29 వరకు అనుమతించినట్టు తెలిపారు. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లోగానీ, కళాశాలల్లో సంప్రదించాలని సూచించారు.

తాగునీటి కోసం నిరసన


ఎంపీవోకు సమస్య వివరిస్తున్న మహిళలు

రామడుగు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం గ్రామ పంచాయతీ గేటుకు తాళం వేసి ఖాళీ బిందెలతో మహిళలు నిరసన చేపట్టిన సంఘటన రామడుగు మండలం వెలిచాల గ్రామంలో జరిగింది. గ్రామంలోని పదవ వార్డులో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నప్పటికీ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా తమ సమస్య పరిష్కరించడం లేదని మహిళలు పెద్ద ఎత్తున గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు తరలివచ్చి గేటుకు తాళం వేశారు. ఈ సందర్భంగా ఖాళీ బిందెలతో నిరసన చేపట్టి ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఎంపీవో శ్రావణ్ అక్కడికి తరలివచ్చి మహిళలతో మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో మహిళలు నిరసన విరమించారు.

రైతులకు కరెంటు కష్టాలు


పోచంపేటలో వంగిన కరెంట్ స్తంభం

సారంగాపూర్, అక్టోబరు, 17 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతి కందే సమయంలో రైతులకు కరెంట్ కష్టాలు తప్పడం లేదు. మండలంలోని పోచంపేటలో పంట పొలాల్లో కరెంట్ పోలు వంగి ప్రమాదకరంగా ఉంది. కొనాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి ఆరు నెలలైనా మరమ్మతులు చేయకుండా వదిలేశారు. రైతులకు పొలాల వద్ద కరెంట్ సమస్యలు ఉన్నాయని వాటిని మరమ్మతులు చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా గ్రామాల్లో కరెంట్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. పొలాలు కోసే క్రమంలో హర్వెస్టర్లు తగిలి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రైతులు చెపుతున్నారు. జిల్లా స్థాయి విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకుని చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


కోనాపూర్‌లో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

కోనరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నిజామాబాద్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ క్రీడలకు ఎంపికైనట్లు హెచ్ఎం సహవుద్దీన్ తెలిపారు. నిజామాబాద్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న రోహిత్, వినిస్, జైస్వాల్, రియాన, జాన్సిక విద్యార్థులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచగా రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం శ్రీనివాస్ రెడ్డి, అజయ్ కుమార్ తదితరులు అభినందించారు.

లక్కు 'కిక్కు' ఎవరికో..?

- ముగిసిన మద్యం టెండర్ల దరఖాస్తు గడువు.. - 23న కలెక్టరేట్‌లో లక్కీడ్రా..

- 48వైన్స్‌లకు 1324 దరఖాస్తులు దాఖలు - గతంలో కంటే తగ్గిన దరఖాస్తులు

- 150మందికి పైగా మహిళా దరఖాస్తుదారులు - ఎక్సైజ్ శాఖకు రూ.39.72 కోట్ల ఆదాయం


దరఖాస్తు చేస్తున్న మద్యం వ్యాపారులు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో వైన్స్ టెండర్ దరఖాస్తులు మందగించాయి. జిల్లాలోని ఎక్సైజ్ శాఖకు ఈసారి రియల్ ఎస్టేట్, దరఖాస్తు ఫీజు పెంపు ప్రభావం చూపింది. రాబోయే కాలమంతా స్థానిక ఎన్నికల సీజన్ అయినప్పటికీ మద్యం వ్యాపారుల్లో పోటీ కనిపించలేదు. ప్రధానంగా మద్యం వ్యాపారులు గ్రూపులుగా ఏర్పడి వైన్స్‌లు దక్కించుకునేందుకు వ్యూహాత్మకంగా దరఖాస్తు చేశారు. ఎవరికి వచ్చినా అందరూ భాగస్వాములు అనే విధంగా ముందే సిండికేట్ అయ్యారు. గతంలోకంటే సగానికే దరఖాస్తులు పడిపోయాయి. సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలోని 48వైన్స్‌లకు చివరి రోజు శనివారం వరకు దాదాపు 1324 దరఖాస్తులు దాఖలు అయ్యాయి. వైన్స్‌లకు సమర్పించిన ఒక్కో దరఖాస్తు ఫీజు రూ.3లక్షలు నాన్ రిఫండెబుల్ కావడంతో రూ.39.72 కోట్లు ఎక్సైజ్ శాఖ ఖజానాకు జమఅయింది.వీటిలో 150మందికి పైగా మహిళలు దరఖాస్తులు కావడం గమనార్హం. ఇందులో 48మంది మద్యం వ్యాపారులు అదృష్టవంతులెవరనేది నాలుగు రోజులు ఆగాల్సిందే. జిల్లాలోని పలువురు బడావ్యాపారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం స్నేహితుల పేరిట వైన్స్‌లను కైవసం చేసుకునేందుకు దరఖాస్తుచేశారు.రిజర్వేషన్ వైన్స్‌లకు సైతం ఆ గ్రూపుల నుండే బినామీల ద్వారా దరఖాస్తులు చేయించారు.

చివరి రోజు దరఖాస్తుల జోరు

వైన్స్‌లను దక్కించుకోవడానికి చివరి రోజు దరఖాస్తులు జోరుగా దాఖలయ్యాయి. 22వ రోజు వరకు 852దరఖాస్తులు మాత్రమే రాగా చివరి రోజైన శనివారం దాదాపు 572 దరఖాస్తులు మద్యం వ్యాపారులు సమర్పించారు. మద్యం వ్యాపారులు నిరాశతో దరఖాస్తులు దాఖలు చేయడం కనిపించింది. ఈసారి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వర్తక, వాణిజ్య వ్యాపారులు వైన్స్‌లకు దరఖాస్తులు వేయడానికి ఆసక్తి చూపలేదు. సాయంత్రం 5గంటలకే సమయం ముగిసినప్పటికీ టోకెన్‌లు ఇచ్చి దరఖాస్తులు స్వీకరించారు. వైన్స్‌లకు దరఖాస్తు చేయడానికి రాత్రి 11గంటల వరకు మద్యం వ్యాపారులు బారులు తీరారు.

దరఖాస్తుల ఆదాయం రూ. 39.72కోట్లు

జిల్లాలో వైన్స్‌లకు కేవలం దరఖాస్తుల ద్వారా ఎక్సైజ్‌శాఖకు రూ. 43.59కోట్ల ఆదాయం సమకూరింది. గత 2017లో 672 దరఖాస్తులకు రూ.6.72కోట్లు, 2019లో 648 దరఖాస్తులకు రూ.12.96కోట్లు, 2021లో 944 దరఖాస్తులకు రూ. 18.88కోట్లు, 2023-25లో 2036 దరఖాస్తుల ద్వారా 40.72కోట్లు వచ్చాయి. ఈసారి 1324దరఖాస్తుల ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ.39.72కోట్ల ఆదాయం సమకూరింది. 8ఏళ్లలో దరఖాస్తుల ద్వారా ఆదాయం ఆరురేట్లు పెరిగింది. గతంలో కంటే దరఖాస్తు ఫీజు ఆదాయం కొంచెం పెరిగినప్పటికీ ఎక్సైజ్ శాఖ ఆశించిన స్థాయిలో దరఖాస్తులు దాఖలు కాలేదు.

కలెక్టరేట్‌లో లక్కీడ్రా..

జిల్లాలోని 48వైన్స్‌లకు దరఖాస్తుల ప్రక్రియ ముగియడంతో లక్కీడ్రాపై దృష్టి పెట్టారు. ఈనెల 23న ఉదయం 11గంటలకు జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో కలెక్టర్ అధ్యక్షతన డ్రా తీసేందుకు ఏర్పాట్లుచేశారు. అదేరోజు లైసెన్సులు అందిస్తారు. డిసెంబరు 1నుంచి మద్యం అమ్మకాలు ప్రారంభం అవుతాయి. 48 వైన్స్‌లకు లక్కెవరికి అనేది చర్చనీయాంశంగా మారింది.

బీసీ సంఘాల బంద్ ప్రశాంతం


వీర్నపల్లిలో నినాదాలు చేస్తున్న నాయకులు


బోయినపల్లిలో బంద్ నిర్వహిస్తున్న నాయకులు


కోనరావుపేటలో షాపులను బంద్ చేయిస్తున్న వామపక్షాల నాయకులు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీ సంఘాల జేఏసీ తలపెట్టిన రాష్ట్రవ్యాప్త బంద్ ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో శనివారం ప్రశాంతంగా ముగిసింది. నాయకులు బాల్‌రెడ్డి, కృష్ణహరి, లక్ష్మణ్, నర్సయ్య, గౌస్, కిషన్, రాజు, కైలాసం, శ్రీశైలం, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, బాబు, రామచంద్రారెడ్డి, కుమార్, సత్యంరెడ్డి, బుగ్గారెడ్డి, రాజం, దేవరాజు, మల్లేశం, అరుణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడలో బంద్ విజయవంతంగా కొనసాగింది. వేములవాడ ఆర్టీసీ డిపో నుంచి బస్సులు బయటకు వెళ్లకుండా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్, సీపీఎం, బీజేపీ నాయకులు డిపో ఎదుట ధర్నాలో పాల్గొన్నారు.

● బోయినపల్లి : మండలంలో బంద్ సంపూర్ణంగా కొనసాగింది. మాజీ డీసీఎంహెచ్ చైర్మన్ ముదిగంటి సురేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, సెస్‌డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, కూస రవీందర్, ఏనుగుల కనకయ్య, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్, వన్నెల రమణారెడ్డి, కొండయ్య, అనుముల భాస్కర్, లక్ష్మీరాజం, తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేటలో బంద్ విజయవంతమైంది. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, పాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, చేపూరి గంగాధర్, సదానందం, పెద్దల శ్రీనివాస్, మానుక సత్యం, చందనగిరి గోపాల్, గొట్టె రుక్మిణి, కర్రోళ్ల భాస్కర్, దేవరకొండ చారి, రామచంద్రం, ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, బీఆర్ఎస్ నాయకులు మల్యాల దేవయ్య, సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, గోపి రావు తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండలంలో బంద్ విజయవంతమైంది. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు తిప్పని శ్రీనివాస్, చిలుక పెంటయ్య, ఈర్లపల్లి రాజు, పులి సత్తయ్య, మ్యాకల పరశురాములు, కుసుంబ జనార్ధన్, వెంకటేశం, రవి, శ్రీనివాస్, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

● రుద్రంగి : రుద్రంగి మండలంలో బంద్ విజయవంతం అయింది. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దెగవాత్ తిరుపతి, బీజేపీ జిల్లా కార్యదర్శి నంద్యాడపు వెంకటేష్, కాంగ్రెస్ ఓబీసీ మండల అధ్యక్షుడు గండి నారాయణ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దయ్యాల నారాయణ, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, పడాల గణేష్, గంగం మహేష్, మంచే రాజేశం, ఇప్ప మహేష్, దయ్యాల కమలాకర్, పోగుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : ముస్తాబాద్ మండలంలో బంద్ ప్రశాతంగా జరిగింది. రోడ్డుపై వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు, గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి ఈడ్గురాళ్ల సురేశ్‌గౌడ్, జెల్ల వెంకటస్వామి కొండ యాదగిరిగౌడ్, సొల్ల క్రాంతి, యెల్ల బాల్‌రెడ్డి, సురేందర్‌రావు, ఒరగంటి తిరుపతి, కొమ్ము బాలయ్య, చాకలి రమేశ్, కరుణాకర్, గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, తోట ధర్మేందర్, రాంగోపాల్, గీస శంకర్, నందం, చికోటి మహేశ్, నర్సింలు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలో బంద్ విజయవంతం అయ్యింది. మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్యయాదవ్, గజ్జల రాజశేఖర్, గుంటి మహేష్, బత్తిని స్వామి, అంతగిరి వినయ్‌కుమార్, పసుల వెంకటి, తీగల పుష్పలత, కాథ మల్లేశం, జమాల్, జ్యోతి, గుండ వెంకటేశం, కూనబోయిన బాలరాజు, యాస తిరుపతి, కొయ్యడ భాస్కర్, కమటం రాములు, సలీం, నవీన్, ఏనుగుల లింగన్న, ఎల్లోజి, మల్లయ్య పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బంద్ విజయవంతమైంది. అన్ని రాజకీయ పార్టీల నాయకులు బంద్‌లో పాల్గొన్నారు.


చందుర్తిలో పాఠశాలను బంద్ చేస్తున్న జేఏసీ నాయకులు



రుద్రంగిలో పాఠశాలను బంద్ చేయిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు

● తంగళ్లపల్లి : మండలంలో బంద్ సంపూర్ణంగా జరిగింది. ఎగుర్ల కరుణాకర్, కందుకూరి రామగౌడ్, గజభీంకర్ రాజన్న, జల్గం ప్రవీణ్, మచ్చ శ్రీనివాస్, సత్తు శ్రీనివాస్‌రెడ్డి, ఎగుర్ల ప్రశాంత్, చుక్క శేఖర్, గజభీంకర్ సంతోష్, హమీద్, మచ్చ ఆనందం, గుగ్గిళ్ల భరత్‌గౌడ్, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ముస్తాబాద్‌లో వంటావార్పు చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు



ఇల్లంతకుంటలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు


గంభీరావుపేటలో మాట్లాడుతున్న నాయకులు

పోక్సో చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

వేములవాడ క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని వేములవాడ అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. శనివారం వేములవాడ పట్టణంలోని రెండవ బైపాస్ రోడ్డులోగల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పోక్సో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థునులతో ఉపాధ్యాయులు గురుతర బాధ్యతగా పనిచేయాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల మధ్య తేడాలు గమనించాలన్నారు. ఇందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు స్ఫూర్తిదాయంగా మారాలన్నారు. అనంతరం విద్యార్థునులతో కలిసి అడిషనల్ ఎస్పీ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ వీరప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడలో రెండో శ్రేణి మెజిస్ట్రేట్ కోర్టు మంజూరు

వేములవాడ క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ కోర్టుకు అదనంగా 2వ శ్రేణి మెజిస్ట్రేట్ కోర్టు మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ కోర్టు ఏర్పాటులో భాగంగా కాంట్రాక్టు పద్ధతిలో అధికారిని, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో రెండు పోస్టులు నియామకం చేపట్టాలని ఆదేశాలు జారీచేశారు. వీరు అయిదు నెలలపాటు మార్చి, 2026వరకు మాత్రమే పనిచేయాల్సి ఉంటుందని, తదుపరి పూర్తిస్థాయి ఉద్యోగుల నియామకం చేపడుతామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వేములవాడ కోర్టులో 2వ శ్రేణి మెజిస్ట్రేట్ కోర్టు మంజూరు కావడంతో ఇకనుంచి డ్రంకెన్‌డ్రైవ్, ఈ చాలన్స్ కేసులన్నీ సులభంగా పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. ఈ కోర్టు ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు కొనసాగుతుంది. దీంతో జూనియర్ సివిల్ కోర్టుకు కొంత భారం తగ్గనుంది.

సిరిసిల్లకు స్పెషల్ కోర్టు..

రాజన్న సిరిసిల్ల జిల్లాకు స్పెషల్ కోర్టు మంజూరు చేస్తూ శనివారం రాష్ట్ర న్యాయ కార్యదర్శి బి. బాపిరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఉన్న 1వ అడిషనల్ సెషన్స్ జిల్లా కోర్టుకు ఇకనుంచి ఏసీబీ ఎస్‌ఐఏ, ఫాస్ట్‌ట్రాక్ తదితర కేసులను బదిలీ చేసే అవకాశం ఉంది.

విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ

కోనరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లిమక్త ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను ఆకట్టుకునే విధంగా యూనిఫాంలను ఉపాధ్యాయులు ఏర్పాటుచేశారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు తీసిపోని విధంగా యూనిఫామ్‌తో పాటు టై, బెల్ట్‌లను ఉపాధ్యాయులు ఏర్పాటు చేసి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో అందజేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయ బృందానికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

టపాసుల దుకాణాలకు డ్రా

- జిల్లా వ్యాప్తంగా 85 షాప్స్ ప్రారంభం



ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వేములవాడ క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టపాసుల దుకాణాల డ్రా నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయాల్లో ఈనెల 1 నుంచి 15 వరకు టపాసుల దుకాణాల ఏర్పాటుకు వ్యాపారులు దరఖాస్తులు చేశారు. వ్యాపారులు గత 18 రోజులుగా కార్యాలయాల చుట్టూ తిరగడంతో చివరి రోజున మున్సిపల్, ఫైర్, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల నుంచి ఎన్‌వోసీ లభించింది. అయితే నిబంధనలు పాటించడంలేదు. ఈనెల 20న దీపావళి కావడంతో దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికి అనుమతి లభించింది. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో శనివారం వ్యాపారుల ఎదుట డ్రాతీశారు. దీంతో జిల్లావ్యాప్తంగా 85టపాసుల దుకాణాలు ప్రారంభమయ్యాయి. ఇందులో సిరిసిల్లలో 43, వేములవాడలో 15, ఎల్లారెడ్డిపేటలో 10, గంభీరావుపేటలో 6, ముస్తాబాద్‌లో 1, ఇల్లంతకుంటలో 3, వీర్నపల్లిలో 1, తంగళ్లపల్లిలో 2 టపాసుల దుకాణాలు ఏర్పాటు చేశారు. సిరిసిల్ల పట్టణంలోని మానేరువాగు బతుకమ్మ తెప్పెవద్ద, వేములవాడ పట్టణంలోని బైపాస్‌రోడ్డు పక్కన ఒకేచోట టపాసుల దుకాణాలు ఏర్పాటుచేశారు. వేములవాడ పట్టణ పరిధిలో అగ్రహారంలో హరిహర, బైపాస్ రోడ్డులో ఎస్ఆర్ఆర్ రెండు హోల్‌సెల్ దుకాణాలు ఏర్పాటయ్యాయి. మూడు రోజులు టపాసుల దుకాణాల్లో క్రయవిక్రయాలు సాగనున్నాయి. ఆతర్వాత షాప్స్ తొలగించాల్సిందే. కేవలం హోల్‌సెల్ దుకాణాలు మాత్రమే 365రోజులు అమ్మేందుకు అవకాశం ఉంది.

ఫైర్ సెఫ్టీపై అవగాహన..

సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ఏర్పాటుచేసిన టపాసుల దుకాణాల వద్ద అగ్నిమాపక శాఖ అధికారులు ఫైర్‌సేఫ్టీపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వేములవాడ ఫైర్ అధికారి ఎన్. అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

వేములవాడ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో పనులను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో గల ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రోడ్లు, పలు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ పరిధిలో నిర్మాణంలో ఉన్న రోడ్లు, ఇప్పటికి ప్రారంభించిన పనులు, సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఈఈలు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, డీఈలు పవనకుమారి, సత్యనారాయణ, విష్ణువర్ధన్ ఏఈలు ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

కొనుగోళ్లను వేగవంతం చేయాలి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సెర్ప్ మండల ప్రత్యేక అధికారి లింగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. తేమ శాతం వచ్చిన వెంటనే తూకం వేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం, రైతుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అన్నారు. ఆయన వెంట ఏపీఎం నర్సయ్య, తదితరులు ఉన్నారు.

బీసీ బంద్‌కు అన్ని వర్గాల ప్రజల సహకారం..

- జాతీయ బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినోద్


మాట్లాడుతున్న అధ్యక్షుడు దండు వినోద్

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించినందుకు జాతీయ బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దండు వినోద్ ధన్యవాదాలు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఐక్యతతోనే బీసీల హక్కులను సాధించుకోగలమన్నారు. రాష్ట్రంలో బీసీలు రాజకీయ పార్టీల విధానాలను గమనిస్తున్నారని రానున్న ఎన్నికలలో బీసీలు ఓట్లతోనే తగిన గుణపాఠం చేప్పాలన్నారు. బంద్‌కు సంపూర్ణ సహకారం అందించిన వ్యాపార వాణిజ్య, విద్యా సంస్థలు, బార్ అసోసియేషన్, ఇతరాత్ర వ్యాపార సంస్థలు, అన్ని కుల సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కరెంటుకు అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాల మరమ్మతు పనులను సెస్ ఏఈ పృథ్వీధర్ ఆధ్వర్యంలోని సిబ్బంది పనులను చేపట్టారు. గ్రామంలో 1974లో వేసిన కరెంటు స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు. 51 ఏళ్లకు స్తంభం తొలగిందని గుర్తు చేసుకున్నారు. కరెంటు సరఫరా లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అధికారులు సాయంత్రం విద్యుత్‌సరఫరాను పునరుద్ధరించారు.

నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యంలో తాలు లేకుండా తేమశాతం వచ్చిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని సెర్ప్ ఏపీఎంలు సుదర్శన్, రాజేశంలు అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి, ఎర్రగడ్డతండా, రంగంపేట, అడవిపదిర, బావుసింగ్‌తండా, రాశిగుట్టతండా, వన్‌పల్లి, లాల్‌సింగ్‌తండా గ్రామాల్లో ఆరబెట్టిన ధాన్యం ప్రదేశాలను శనివారం అధికారులు సందర్శించారు. కేంద్రాల్లోని ధాన్యం పరిశీలించారు. గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రైతులు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సూచించారు. సిబ్బంది భూకైలాస్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పూర్తిస్థాయిలో పండిన పంటనే కోయాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : హార్వెస్టర్ యజమానులు పూర్తి స్థాయిలో పండిన పంటనే కోయాలని తహసీల్దార్ ముక్తార్‌పాషా అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో హార్వెస్టర్ యజమానులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ముక్తార్‌పాషా మాట్లాడుతూ ఆర్‌పీఎం 18 నుంచి 19 ఉండేలా చూడాలన్నారు. ధాన్యంలో తాలు, మట్టి రాకుండా జాలీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. సమావేశంలో ఏవో జయ, హార్వెస్టర్ యజమానులు పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాలతో ప్రజలకు చేరువ..

- జిల్లా సహకారశాఖ అధికారి రామకృష్ణ


విద్యార్థులకు సామగ్రిని అందజేస్తున్న అధికారులు

ఇల్లంతకుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువకావచ్చని జిల్లా సహకారశాఖ అధికారి రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని కందికట్కూర్ ఎస్సీ కాలనీ పాఠశాలలో శనివారం హెల్పింగ్ హైండ్స్ స్వచ్ఛంద సంస్థ రూ 80వేల విలువైన వస్తువులను విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రితో పాటు తల్లిదండ్రులకు నిత్యావసర వస్తువులు అందివ్వడం అభినందనీయం అన్నారు. మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి, అనువోజు రాజు, నిర్మల, లక్ష్మి, హెల్పింగ్‌హైండ్స్ వాలంటీర్ బద్దం అనూష, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సింగిల్ విండో డైరెక్టర్ హఠాన్మరణం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట)/కోనరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట సింగిల్ విండో డైరెక్టర్ గజ్జల ఆనందం(42) గుండెపోటుతో హఠన్మరణం పాలైన సంఘటన వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో శనివారం విషాదం నింపింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని ఆనందం బీఆర్ఎస్ పార్టీలో చురుకైన నాయకుడిగా పని చేస్తుండేవాడు. ఆయన కోనరావుపేట ప్యాక్స్ డైరెక్టర్‌గా 2020 నుంచి కొనసాగుతున్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి పాటుపడేవారు. అస్వస్థతకు గురైన ఆనందంను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతిచెందారు. మృతుడికి భార్య సుజాత, కొడుకు జీవన్, కూతుళ్లు అక్షయ, ఆకాంక్ష ఉన్నారు.

ప్రైవేట్ వాహనాల దోపిడీ..

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీసీ బంద్ ప్రయాణికులపై శనివారం తీవ్రప్రభావం చూపించింది. ఆర్టీసీ బస్సులు ఉదయం నుంచి డిపోలకు పరిమితం కావడంతో జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లు వెలవెలబోయాయి. ప్రైవేటు వాహనాల యజమానులు ఇష్టారాజ్యంగా ప్రయాణికుల నుంచి అధిక చార్జీలతో దోపిడీకి పాల్పడ్డారు. కరీంనగర్ నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్ చార్జి రూ.80 ఉండగా ప్రైవేటు వాహనదారుడు రూ.180, కామారెడ్డికి చార్జి రూ.70 ఉండగా రూ. 140, సిద్దిపేటకు చార్జి రూ. 70 ఉండగా రూ. 140 వసూలు చేశారు.

స్తంభాన్ని ఢీకొట్టిన జీపీ ట్రాక్టర్.. ఇద్దరికి గాయాలు

తంగళ్లపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బస్వాపూర్‌లో గ్రామపంచాయతీ ట్రాక్టర్ విద్యుత్‌స్తంభానికి ఢీకొట్టడంతో ఇద్దరు జీపీ కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం రాత్రి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌పై ఇద్దరు కార్మికులు భూమయ్య(52), అనిత(35)లు వస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. సిరిసిల్ల ప్రధాన అసుపత్రికి తరలించగా భూమయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. కాగా భూమయ్య గతంలో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా వైద్యులు ఫేస్‌మేకర్ బిగించినట్లు తెలిసింది. భూయ్య మృతిచెందినట్లు ప్రచారం జరగుతుండగా వైద్యులు మాత్రం మృతిచెందిన విషయాన్ని ధ్రువీకరించకుండా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించాలని చెప్పారు. ఈ సంఘటనపై ఎస్‌ఐని వివరణ కోరగా విద్యుత్తు స్తంభాన్ని ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరు జీపీ కార్మికులు గాయపడ్డారని, ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. భూమయ్యకు గుండె సంబంధిత వ్యాధి ఉండడంతో గతంలో ఫేస్ మేకర్ బిగించారని భూమయ్య మృతిచెందిన విషయాన్ని వైద్యులు ధ్రువీకరించిన అనంతరం ప్రకటిస్తామని తెలిపారు.